నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 6 ఏప్రిల్ 2025 | NIZAMABAD

- తన జీవితాన్ని అణగారిన వర్గాల కోసం అంకితం చేసిన ఆదర్శ నేత
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి
- వేల్పూర్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో పాల్గొన్న వేముల



వేల్పూర్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వేముల

# బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాల సాధనకు కృషిచేయాలి

వేల్పూర్/మోర్తాడ్, ఏప్రిల్ 5 : కులరహిత సమాజం కోసం పాటుపడిన వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో వేముల పాల్గొన్నారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల కోసం రాజ్యాంగం రచిస్తే, ఆ రాజ్యాంగ ఫలాలు అందరికీ అందేలా కృషి చేసిన ఆదర్శ నేత బాబు జగ్జీవన్ రామ్ అని పేర్కొన్నారు. తన జీవిత కాలం మొత్తం అణగారిన వర్గాల కోసం కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కోసం అన్ని వర్గాలు ఏకమై పాటుపడాలని పిలుపునిచ్చారు.

**విద్యార్థులను ఉన్నతలక్ష్యాలు సాధించేలా తీర్చిదిద్దాలి**

విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు చిన్నప్పటి నుంచే వారిలో ఉన్నత లక్ష్యాలు ఏర్పడేలా మార్గదర్శకాలు చేయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని విద్యాసాయి స్కూల్ రజతోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను శనివారం కలిసి వారికి అభినందనలు తెలిపారు. అనంతరం వేములకు రజతోత్సవ వేడుకల జ్ఞాపికను పాఠశాల తరపున అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి , పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట గంగాధర్, ప్రకాశ్, రాధాకిషన్, గడ్డం స్వామి, సుమన్, మైలారం సుధాకర్, రాజన్న, రెంజర్ల మహేందర్, హరీశ్, మురళి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో ఎమ్మెల్యే వేములను సన్మానిస్తున్న విద్యాసాయి స్కూల్ కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

- రెండు పార్టీల తీరుతో సామాన్యులకు తీరని నష్టం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడుతున్న జనం
- పదేండ్లుగా నవోదయ స్థాపనలో బీజేపీ నిర్లక్ష్యం
- త్వరగా స్థలాన్ని తేల్చాలని డిమాండ్




## జాతీయ పార్టీల భూ పంచాయితీ..

నవోదయ ఏర్పాటులో కాంగ్రెస్, బీజేపీ నడుమ స్థల పంచాయితీ పేచీ నడుస్తున్నది. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని జక్రాన్‌పల్లి మండలం కలిగోట్‌లో ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టుబడుతుంటే, బోధన్ నియోజకవర్గ కేంద్రంలో స్థాపించాలని కాంగ్రెస్ ఒత్తిడి తెస్తున్నది. మరోవైపు, ఈ వ్యవహారం అధికార హస్తం పార్టీలోనూ చిచ్చు రేపింది. నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతల్లో వైరం సృష్టించింది. నవోదయ స్థాపన విషయంలో మొన్నటిదాకా ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్న కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇప్పుడు అనూహ్యంగా మౌనం పాటిస్తున్నారు. మొన్నటిదాకా ఆందోళనలు, శవయాత్రలు జరిపిన రెండు పార్టీలు ఇప్పుడు చడీచప్పుడు చేయకపోవడంపై జనాల్లో చర్చ జరుగుతున్నది. నవోదయ ఏర్పాటుకు సువిశాలమైన ప్రాంతం అవసరమని, ఇందుకోసం కలిగోట్ వద్ద 30 ఎకరాలను కేటాయింపు చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తున్నది. కాంగ్రెస్ నాయకత్వం మాత్రం అందుకు భిన్నంగా స్పందించింది. బోధన్ నియోజకవర్గ కేంద్రంలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించిన 8 ఎకరాలు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో నవోదయ ఏర్పాటు విషయంలో ఒకడుగు ముందుకు, పది అడుగులు వెనక్కి అన్నట్లు మారింది.

### బీజేపీ, కాంగ్రెస్ పార్టీల డ్రామా..



నవోదయ విద్యాలయం ఏర్పాటు విషయంలో కాంగ్రెస్, బీజేపీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. జిల్లాకు మంజూరైన నవోదయను స్థాపించేందుకు ఇరు పార్టీలు కలిసి రాజకీయాలు చేస్తున్నాయి. డ్రామాలు బంద్ చేసి అనువైన స్థలాన్ని గుర్తించి నవోదయ విద్యాలయాన్ని త్వరగా ఏర్పాటు చేసేందుకు వెంటనే ప్రయత్నాలు ప్రారంభించాలి.

**- చింత మహేశ్, తెలంగాణ ఉద్యమకారుడు**

### బీఆర్‌ఎస్ పోరాటంతోనే మంజూరు..



పదేండ్లుగా బీజేపీ సర్కారు తెలంగాణపై నిర్లక్ష్యం చూపింది. బీఆర్‌ఎస్ పోరాటంతో ఎట్టకేలకు జిల్లాకు నవోదయను మంజూరు చేసింది. నిజామాబాద్‌కు మంజూరైన నవోదయ విద్యాలయాన్ని 2025-26 విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలి. ఇప్పటికే ఈ ప్రాంత బిడ్డలకు ఎంతో అన్యాయం జరిగింది. బీజేపీ, కాంగ్రెస్ ఇంకా జాప్యం చేసి మరింత అన్యాయం చేయొద్దు.

**- రవికాంత్, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు**

# నవోదయ లేని పార్టీలు!

**విద్యాసంస్థ స్థాపనలో కాంగ్రెస్, బీజేపీల పంతం**

నిజామాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఓట్లేసిన జనానికి మేలు చేయాల్సిన కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టింపులకు పోయి ప్రజలను పరేషాన్ చేస్తున్నాయి. రాజకీయ వైరంతో సామాన్యులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ కలిసి నవోదయ విద్యాలయ స్థాపనను వివాదాంశంగా మార్చేశాయి. రాజకీయ ప్రయోజనం కోసం కొట్లాడుతున్న రెండు పార్టీల తీరుతో అంతిమంగా జిల్లా ప్రజలకు అన్యాయమే జరుగుతున్నది. కేంద్ర ప్రభుత్వం గతేడాది జిల్లాకు నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేసింది. వీలైనంత త్వరగా స్థాపించి ప్రజలకు మేలు చేయాల్సింది పోయి రెండు పార్టీలు రాజకీయం చేయడం ప్రారంభించాయి. ఈ గడ్డపై పుట్టిన బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించకుండా రాజకీయం చేస్తూ విద్యాలయాన్ని ప్రారంభించకుండా అడ్డంకులు సృష్టిస్తున్నాయి. ప్రజా ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ అంశంలో రెండు పార్టీలు వెనక్కి తగ్గక పోగా ఢీ అంటే ఢీ అంటున్నాయి. స్థల సేకరణను కొలిక్కి తేకుండా కొర్రీలు పెడుతుండడంపై జనాగ్రహం వెల్లువెత్తుతున్నది. మరోవైపు, రెండు పార్టీల నడుమ నలిగిపోతున్న అధికారులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

**2025-26లోనే మొదలయ్యేనా..?**

రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసి ఉంటే వేలాది మందికి నాణ్యమైన విద్య లభించేది. కానీ కేంద్రం నిర్లక్ష్యం ఫలితంగా తెలంగాణ బిడ్డలకు అన్యాయం జరిగింది. ఆలస్యంగానైనా నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేసినప్పటికీ, కార్యకలపాలు ఎప్పుడు ప్రారంభమవుతాయనేది స్పష్టత లేకుండా పోయింది. రానున్న (2025-26) విద్యా సంవత్సరంలోపు నవోదయ విద్యాలయాన్ని తాత్కాలిక ఏర్పాట్లతోనైనా ప్రారంభించాలని జిల్లావాసులు కోరుతున్నారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని, లేకపోతే 2026-27 విద్యా సంవత్సరానికి ప్రారంభోత్సవం వాయిదా పడితే విద్యార్థులకు మరింత అన్యాయం జరుగుతుందని చెబుతున్నారు. ప్రజా ప్రయోజనాల విషయంలో పట్టు విడుపులకు పోకుండా బీజేపీ, కాంగ్రెస్ చొరవ తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

**బీఆర్‌ఎస్ పోరాట ఫలితమే...**

తెలంగాణలో కొత్త జిల్లాలకు నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని ఏపీ పునర్విభజన చట్టం 2014లో హామీ ఇచ్చారు. ఇతర కేంద్ర పరిశోధన సంస్థల ఏర్పాటుపైనా హామీలను యూపీఏ ప్రభుత్వం చట్టంలో పొందుపర్చింది. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. చట్టంలోని అనేక అంశాలను అటకెక్కించింది. అందులో విద్యాలయాల స్థాపన కూడా ఒకటి. 2014 నుంచి 2023 వరకూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్.. విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని కేంద్రంపై పోరాటం చేసింది. కేసీఆర్ సారథ్యంలో అనేకసార్లు కేంద్ర మంత్రులను కలిసి విన్నవించారు. మరోవైపు, బీఆర్‌ఎస్ ఎంపీలు పార్లమెంట్ వేదికగా తరచూ ప్రశ్నించారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కేంద్రం తీరును ఎండగట్టారు. తెలంగాణపై మోదీ సర్కారు చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపారు. మొత్తంగా బీఆర్‌ఎస్ పోరాట ఫలితంగా కేంద్రం ఒక మెట్టు దిగి ఎట్టకేలకు నవోదయ విద్యాలయాల స్థాపనకు ముందుకొచ్చింది. నిజామాబాద్‌కు ఒక విద్యాలయాన్ని మంజూరు చేయగా, దీని ఏర్పాటులో కాంగ్రెస్, బీజేపీ నేతల తీరుతో ప్రతిష్టంభన ఏర్పడింది.

## కారులో చెలరేగిన మంటలు

- సురక్షితంగా బయటపడిన ఆరుగురు
- తప్పిన పెను ప్రమాదం
- నేషనల్ హైవేపై ఘటన



మంటల్లో కాలిపోతున్న స్కార్పియో వాహనం

కామారెడ్డి, ఏప్రిల్ 5 : కారులో మంటలు చెలరేగగా.. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామ శివారులోని జాతీయ రహదారిపై శనివారం ఉదయం చోటు చేసుకున్నది. దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి నుంచి బడాపహాడ్‌కు ఆరుగురు కుటుంబ సభ్యులు స్కార్పియో వాహనంలో శుక్రవారం రాత్రి బయల్దేరారు. కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామ శివారు వద్దకు రాగానే కారులో నుంచి పొగలు రావడంతో డ్రైవర్ గమనించి వాహనాన్ని పక్కకు నిలిపాడు. కారులో ఉన్నవారిని అప్రమత్తం చేయడంతో ఆరుగురు వెంటనే దిగిపోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆరుగురు సురక్షితంగా బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైనట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఏడు టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత

పీడీయస్ బియ్యం స్వాధీనం చేసుకొని, వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు



వినాయక్‌నగర్, ఏప్రిల్ 5: నగరంలోని మాలపల్లిలో ఏడు టన్నుల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, అదనపు డీసీపీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో మాలపల్లిలో శనివారం దాడులు నిర్వహించారు. ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న మూడు లక్షల విలువ చేసే ఏడు టన్నుల పీడీఎస్ బియాన్ని స్వాధీనం చేసుకొని, డ్రైవర్ షేక్ ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీని సీజ్ చేసి, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. దాడిలో ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుద్దీపాలతో అలంకరించిన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ రామాలయం



## నేడు శ్రీరామ నవమి

### ముస్తాబైన ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు

ఉమ్మడి జిల్లాలో నేడు శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయాలను ముస్తాబు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథ ఆలయం, సుభాష్‌నగర్‌లోని రామాలయం, కామారెడ్డి పట్టణంలోని రైల్వేస్టేషన్ రామమందిరం, గోపాలస్వామి ఆలయాలతోపాటు హనుమాన్ ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీరాముడి పట్టాభిషేకం, పట్టువస్త్రాల సమర్పణ, సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించడానికి ఆలయాల్లోని కల్యాణ మండపాలను తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

### మద్యం, కల్లు దుకాణాలు బంద్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 5: శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం నిజామాబాద్ జిల్లాలో మద్యం షాపులను మూసివేయనున్నారు. ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు వైన్స్ షాపులు, బార్లు, కల్లు డిపోలు, కల్లు బట్టీలతోపాటు మాదాపూర్‌లోని ఐఎంఎఫ్‌ఎల్ డిపో బంద్ పాటించాలని సీపీ సాయి చైతన్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రకృతి వనంలో ఎండిపోయిన చెట్లు



## ప్రకృతి వనం.. కళా విహీనం

*బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామస్తులకు ఆహ్లాదం పంచడానికి ప్రతి గ్రామంలో ప్రకృతివనాలను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ కోసం ప్రత్యేక వనసేవకులను నియమించి, పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దారు. పచ్చని చెట్లు, పూల మొక్కలతో ఆహ్లాదం పంచిన ప్రకృతి వనాలు.. నేడు కళా విహీనంగా మారాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ప్రకృతి వనాల నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం నెలకొన్నది. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని కాస్‌బాగ్ తండాలోని ప్రకృతివనం పచ్చదనం కోల్పోయి, అస్తవ్యస్తంగా మారింది. అధికారులు కనీసం నీటి సాకర్యం కూడా కల్పించకపోవడంతో వనంలోని చెట్లన్నీ ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రకృతివనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.*

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



